# రాష్ట్రమంతటా బీఎస్ఎన్ఎల్ 4జి సేవలు



**చంద్రుగొండ, అక్టోబర్ 26, ప్రజా జ్యోతి:** త్వరలో రాష్ట్రమంతటా బిఎస్ఎన్ఎల్ 4g సేవలు అందుబాటులోకి వస్తాయని కంట్రోలర్ అండ్ కమ్యూనికేషన్ అకౌంటింగ్ టెలికాం డిపార్ట్మెంట్ తారాచంద్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో బీబీఎన్ఎల్ బిఎస్ఎన్ఎల్ టి ఫైబర్ ద్వారా ఇంటర్నెట్ ఫోర్ జి మొబైల్స్ టవర్స్ అభివృద్ధి పనులను గురించి చర్చించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో త్వరలోనే 4జి సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజలకు ఇంటర్నెట్ మొబైల్ 4g సేవలు అందించడం కోసం తమవంతు సహకారం అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఎస్ఎన్ఎల్ డిజిఎం శ్రీనివాస్, ఏజీఎం సుదీర్, ఎస్ డి ఈ సక్రు నాయక్, షకీల్, బాలాజీ, ఏ ఏ ఓ ఉదయ్, ఓఎస్ శివరాంజి, టి ఫైబర్ ఆఫీసర్ సాయికుమార్ పాల్గొన్నారు.


జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం | 27 | అక్టోబర్ | 2024 ◆ పేజీలు : 7




# సాధారణ కాన్పుకి... సహకారం

2 లో..

**సుఖ ప్రసవానికి విశేష కృషి**

**సత్ఫలితాలను ఇస్తున్న మిడ్ వైఫరీ**

**ఐదేళ్లలో 6000 ప్రసవాలు**

కాలం మారింది. పురిటి నొప్పులు భరించి బిడ్డలను కనే సహనం తగ్గుతోంది. ప్రసవ వేదనతో పిల్లలకు జన్మనిచ్చే బదులు ముహూర్తాల మధ్య సిజేరియన్ డెలివరీవైపు మొగ్గుచూపుతున్నారు . తల్లిదండ్రులు కూడా ఆడ పిల్లలపై గారాబం పెరగడంతో , ఆడపిల్ల పురిటి నొప్పులు పడితే భరించలేకపోతున్నారు. సిజేరియన్ చేసేయాలంటూ వైద్యులపై ఒత్తిడి తెస్తున్నారు. మరో వైపు మారిన జీవనశైలి వల్ల సాధారణ కాన్పులు తగ్గిపోతున్నాయి. అంతా ఆపరేషన్ల ద్వారానే పిల్లలకు జన్మనిస్తున్నారు . ఇంకోవైపు వైద్యుల వ్యాపార ధోరణి కారణంగా సిజేరియన్ అయితేనే తల్లి బిడ్డలు క్షేమం అంటూ భయం కల్పిస్తున్నారు. తద్వారా సొమ్ములు చేసుకుంటున్న తరుణంలో భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి కేంద్రంగా సాధారణ కాకాన్పుల కొరకు సహకారాన్ని అందిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర సహకారంతో సుఖ ప్రసవానికి విశేష కృషి చేస్తున్నారు. గడిచిన ఐదేళ్లలో 6 వేలకు పైగా సాధారణ కాన్పులు చేసిన "మిడ్ వైఫరీ " విధానంపై ప్రజాజ్యోతి ప్రత్యేక కథనం...

◆ భద్రాచలం, ప్రజాజ్యోతి

# చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు

– రౌడీ షీటర్లు, సమస్యాత్మక వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా: ఎస్పీ రోహిత్ రాజ్



**ఇల్లందు, అక్టోబర్ 26, ప్రజాజ్యోతి:** చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని, రౌడీ షీటర్లు, సమస్యాత్మక వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని జిల్లా ఎస్పి రోహిత్ రాజ్ స్పష్టం చేశారు. శనివారం ఇల్లందు పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పి సందర్శించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో ఇప్పటివరకు నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా ఎలాంటి కేసులు నమోదవుతాన్నాయో తెలుసుకుని, వాటి పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ కు సంబంధించిన రికార్డులు, ఫైళ్లను ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకుంటూ ఒక క్రమ పద్ధతిలో అమర్చుకోవాలని సూచించారు. పోలీస్ అధికారులు, సిబ్బందికి విధుల పరంగా ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే తమ

మిగతా 2 లో...

# వైద్యం వికటించి.. తల్లీ బిడ్డ మృతి



**అమ్మ కావాల్సిన తల్లి.. అసువులు బాసింది**

**ప్రసవం కోసం వెళితే శవమై వచ్చింది....**

**పాల్వంచ సి హెచ్ సీలో వైద్యుల నిర్లక్ష్యంతో తల్లి బిడ్డా మృతి అని ఆరోపణ..**

**ములకలపల్లి, అక్టోబర్ 26, ప్రజాజ్యోతి:** ప్రసవం కోసం పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళిన గర్భిణీ బిడ్డ తో సహా శవమై ఇంటికి రావడంతో మండలంలోని పాత గంగారం వాగొడ్డు గుంపులో విషాదం చోటు చేసుకుంది. మృతురాలి భర్త పోడియం దినేష్ తెలిపిన

మిగతా 2 లో...

**అధిక లోడులు, మితిమీరిన వేగం.?**

**33 టన్నులకు బదులు సుమారు 39 టన్నుల బొగ్గు రవాణా..!**

**యూరియా సంచులతో కుట్టిన టర్బాలిన్ కట్టే బదులు గ్రీన్ మ్యాట్ కట్టుడు ఏమిటి?**

# పట్టించుకోని అధికారులు..?

**టేకులపల్లి, అక్టోబర్26, ప్రజాజ్యోతి:** మండలంలోని కె.ఓ.సి నుంచి ఇల్లందు సిహెచ్పి వైపు తిరుగుతున్న 16టైర్ లారీలో సుమారు 39టన్నుల బొగ్గు రవాణా చేస్తున్నారు అని టేకులపల్లి మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. రవాణా శాఖ ఇచ్చిన పరిమితి కేవలం 33 టన్నులు మాత్రమే అని తెలిపారు.కొత్తగూడెం ఆర్సి హెచ్పి కు వేలే లారీలు 14టైర్లకు 27టన్నులు ప్రభుత్వం ఇచ్చినది కానీ ఆ లారీలలో 33నుంచి 35టన్నులు బొగ్గు రవాణా చేస్తున్నారు. చర్యలు ఏవి అని అడుగుతున్న స్థానిక ప్రజలు, అధిక లోడింగ్ వల్లన రోడు ఘోరంగా పాడై పెద్ద పెద్ద గుంటలుగా తయారైన రోడ్డు





మిగతా 2 లో...

## వైద్యం వికటించి .. తల్లీ బిడ్డ మృతి

(మొదటి పేజీ తరువాయి... )

వివరాల ప్రకారం మండల పరిధిలోని పాత గంగారం పంచాయితీ వాగొడ్డుగుంపు లో గొత్తికోయ గ్రామానికి చెందిన పోడియం మోతి (22) ని ప్రసవం కోసం స్థానిక ఆశా కార్యకర్త ఈ నెల 24 న గురువారం పాల్వంచ ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కు తీసుకువెళ్లారు. సాయంత్రం వరకు ఆసుపత్రిలో ఉంచిన వైద్యులు సాయంత్రం ఇంటికి పంపించారు. మరుసటి రోజు శుక్రవారం నొప్పులు రావడంతో భర్త మరల పాల్వంచ సి హెచ్ సి కి తీసుకువెళ్లాడు. అదే రోజు వైద్యులు మోతి కి శస్త్ర చికిత్స చేయాగా ఆడ శిశువు చనిపోయింది. శిశువు చనిపోయిన తన భార్య బాగానే ఉందని, ఆపరేషన్ ధియేటర్ లో నుంచి బయటకు తీసుకువచ్చి వైద్యం అందిస్తుండగా, అప్పటి వరకు మాట్లాడిన తన భార్యకు వైద్యులు ఎదో ఇంజక్షన్ ఇచ్చారని అప్పటి నుంచి తన భార్య శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతూ, తీవ్రమైన దగ్గు వచ్చిందని, వెంటనే వైద్యులు మోతి ని తనకు చూపించకుండా వేరే రూం కి తీసుకువెళ్లారని, ప్రవేటు ఆసుపత్రికి తీసుకువెళతా అన్న వినకుండా వైద్యులు తన భార్యకు ఏమికాదు బాగానే ఉంది అంటూ వైద్యం చేశారని, ఆసుపత్రిలో ని వైద్యుల నిర్లక్ష్యం కారణంగా వైద్యం వికటించే తన భార్య మృతి చెందిందని దినేష్ ఆరోపిస్తున్నాడు.

## పట్టించుకోని అధికారులు.?

(మొదటి పేజీ తరువాయి... )

పరిస్థితి దీని వల్ల కొంత మంది ప్రమాదలు జరిగి ప్రాణాలు కొలిపోయారు అని దాస్ తండ గ్రామస్తులు తెలిపారు. టేకులపల్లి, దాస్తండ, రేగులతండ గ్రామంలో వేగం పరిమితి 20 కంటే మించకూడదు అయినా లారీ చోదకులు ద్విచక్ర వాహనం నడిపినట్టుగా కటింగ్లు కొట్టుకుంటూ ఊర్లలో కూడా వాహనాన్ని అతివేగంగా నడుపుతారు. లారీ డ్రైవింగ్ చేసే డ్రైవర్లకు లైసెన్సులు చాలా మందికి లేవు, ఈ డ్రైవర్ కి ఎక్కువ అనుభవం లేదని గ్రామస్తులు తెలిపారు. ఇట్టి విషయాన్ని అధికారులు గానీ సింగరేణి అధికారులు కానీ దృష్టిలో పెట్టుకొని ఎమ్మటే వారిపై చర్యలు తీసుకోవడం, గ్రీన్ కలర్ మ్యాట్ పట్టాను తొలగించి, సరైన బస్తాలతో కుట్టిన పాట్టను అధికారికంగా ప్రకటించాలని గ్రామస్తులు తెలుపుతున్నారు. దానివలన బొగ్గు బాడీలో ఎత్తుగా వచ్చిన కింద పడదని గ్రామస్తులు తెలుపుతున్నారు. ఎవరికి ఎటువంటి హాని జరగకుండా ఉంటుందని, ఎవరు వారి కుటుంబాన్ని దూరం కాకుండా ఉంటారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. లారీలు పోయే వేగానికి దుమ్ము ధూళి వలన ఇళ్లల్లోకి భయంకరమైన దుబ్బ వస్తున్నది. అది ఇళ్లల్లోకి వచ్చేది వంట సామల మీద టేబుల్ మీద పడితే అవ్వబడుతుంది కానీ, మన ఊపిరితిత్తుల్లో పోయేది ఆపదదు దానివల్ల ఎన్నో రోగాలు వస్తున్నాయి అని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్ల రైతులు గేదెల మీద ఆధారపడి ఉన్న కుటుంబాలు చాలా ఉన్నాయి రోడ్డుకెక్కడం ఆలస్యం అనుభవం లేని డ్రైవర్ తోలడం వల్ల కంట్రోల్ చేసుకోలేక వాటిని ఢీకొట్టడం జరుగుతుంది అవి అక్కడికక్కడే మరణిస్తున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వాటి మీదనే ఆధారపడి కుటుంబాలు చాలా ఉన్నాయి అయినా గాని ట్రాన్స్పోర్ట్ నిర్వాహకులు , సింగరేణి అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు , మాకేం సంబంధం మా కోయ గూడెం ఓసి చెక్పోస్ట్ దాటితే మాకు ఎటువంటి సంబంధం ఉండదని సింగరేణి అధికారులు తెలుపుతున్నారని గ్రామస్తుల ఆరోపిస్తున్నారు.

## చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు

(మొదటి పేజీ తరువాయి... )

దృష్టికి తీసుకురావాలని కోరారు. తమ పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమించి సాధారణ ప్రజానీకానికి ఇబ్బందులు కలిగిస్తే అట్టి వారిపై ఉక్కుపాదం మోపాలని పేర్కొన్నారు. అనంతరం ఇల్లందు పోలీస్ స్టేషన్ లో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలను అడిగి వాటి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు డిఎస్పి ఎన్. చంద్రభాను, సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్సై నాగుల్ మీరా, సూర్య, సిబ్బంది పాల్గొన్నారు.





# సాధారణ కాన్పుకి... సహకారం

**సుఖ ప్రసవానికి విశేష కృషి**

**సత్ఫలితాలను ఇస్తున్న మిడ్ వైఫరీ**

**ఐదేళ్లలో 6000 ప్రసవాలు**

**కాలం మారింది. పురిటి నొప్పులు భరించి బిడ్డలను కనే సహనం తగ్గుతోంది. ప్రసవ వేదనతో పిల్లలకు జన్మనిచ్చే బదులు ముహూర్తాల మధ్య సిజేరియన్ డెలివరీ వైపు మొగ్గుచూపుతున్నారు. తల్లిదండ్రులు కూడా ఆడ పిల్లలపై గారాబం పెరగడంతో , ఆడపిల్ల పురిటి నొప్పులు పడితే భరించలేకపోతున్నారు. సిజేరియన్ చేసేయాలంటూ వైద్యులపై ఒత్తిడి తెస్తున్నారు. మరో వైపు మారిన జీవనశైలి వల్ల సాధారణ కాన్పులు తగ్గిపోతున్నాయి. అంతా ఆపరేషన్ల ద్వారానే పిల్లలకు జన్మనిస్తున్నారు. ఇంకో వైపు వైద్యుల వ్యాపార ధోరణి కారణంగా సిజేరియన్ అయితేనే తల్లి బిడ్డలు క్షేమం అంటూ భయం కల్పిస్తున్నారు. తద్వారా సొమ్ములు చేసుకుంటున్న తరుణంలో భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి కేంద్రంగా సాధారణ కాకాన్పుల కొరకు సహకారాన్ని అందిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర సహకారంతో సుఖ ప్రసవానికి విశేష కృషి చేస్తున్నారు. గడిచిన ఐదేళ్లలో 6 వేలకు పైగా సాధారణ కాన్పులు చేసిన "మిడ్ వైఫరీ " విధానంపై ప్రజాజ్యోతి ప్రత్యేక కథనం...**

*భద్రాచలం, అక్టోబర్ 26, ప్రజాజ్యోతి:* పూర్వం 100 ప్రసవాలలో ఒకటో ,రెండో సిజేరియన్ ప్రసవాలు జరిగేవి మిగిలినవన్నీ సాధారణ కాన్పులే... తల్లి వెచ్చని పొత్తిళ్ళలో శిశువుకు స్వర్గం కన్నా మిన్నగా పురిటి నొప్పులు అనుభవించి బిడ్డను కన్న తల్లి.. ఆ చిన్నారికి పాలు పడుతూ తన ప్రసవ వేదనంతా మర్చిపోయి. కన్న బిడ్డను చూసి ఆ తల్లులు మురిసిపోయే వారు. కానీ ప్రస్తుతం మారిన జీవనశైలి వల్ల సాధారణ కాన్పులు తగ్గిపోతున్నాయి. అంతా ఆపరేషన్ల ద్వారానే పిల్లలకు జన్మనిస్తున్నారు. ఇటువంటి పరిస్థితులను నిరోధించేందుకు భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి కేంద్రంగా మిడ్ వైఫరీ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ఏజెన్సీలోని ఎంతోమంది గర్భిణీ స్త్రీలకు సుఖ ప్రసవం జరిగేలా సహకారాలను అందిస్తున్నారు.

### తొలినాళ్లలో...

యూనిసెఫ్, హైదరాబాదులోని ఫెర్నాండేస్ ఆసుపత్రి వారితో కలిపి 2019లో రాష్ట్ర వైద్య విధాన పరిషత్ అధికారులు సాధారణ కానుకలను ప్రోత్సహించేందుకు రూపొందించిన కార్యక్రమమే మిడ్ వైఫరీ . రాష్ట్ర వ్యాప్తంగా పలువురు సీనియర్ స్టాఫ్ నర్సులను ఎంపిక చేసి 6 నెలల పాటు హైదరాబాద్ కేంద్రంగా మిడ్ వైఫరీ విధానంలో శిక్షణ ఇవ్వగా, అనంతరం రాష్ట్రంలోని ఎనిమిది ప్రాంతాలను గుర్తించి ఈ పథకాన్ని పైలట్ ప్రాజెక్టుగా మొదలుపెట్టారు. ఇందులో భాగంగానే భద్రాచలం ఏరియా ఆసుపత్రిని కూడా ఎంపిక చేశారు. భద్రాచలం ఏరియా ఆసుపత్రి కేంద్రంగా 2019 మే 1న మిడ్ వైఫరీ పథకాన్ని ప్రారంభించగా నాటి నుంచి నేటి వరకు సుమారు 6వేలకు పైగా సాధారణ ప్రసవాలు జరగడం విశేషం.

### భద్రాచలంలో ఇలా...

భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో హెడ్ నర్స్ విజయశ్రీ ఆధ్వర్యంలో మిడ్ వైఫరీ ప్రోగ్రాం అమలవుతుంది. విజయశ్రీ బృందం భద్రాచలం ఏజెన్సీలోని గర్భిణీ స్త్రీలకు సాధారణ కానుకపై అవగాహన కల్పిస్తూ సిజేరియన్ ఆపరేషన్లను తగ్గించి, సాధారణ ప్రసవాలను ప్రోత్సహిస్తున్నారు. అంతేకాకుండా ఏడు నెలలు నిండిన గర్భిణీకి స్త్రీలకు సాధారణ ప్రసవం అయ్యేందుకు పలు రకాల వ్యాయామాలతో పాటు తీసుకోవలసిన పౌష్టికాహారం తదితర విషయాలపై అవ గాహ న కల్పిస్తు న్నారు . గర్భిణీ స్త్రీలలో మనోధైర్యాన్ని నింపుతూ సాధారణ ప్రసవం అయ్యేలా కృషి చేస్తున్నారు. మిడ్ వైఫరీ పథకం అమలుకు పూర్వం 75 శాతం వరకు ఉన్న సిజేరియన్ ఆపరేషన్లను హెడ్ నర్స్ విజయశ్రీ బృందం 35 శాతానికి తగ్గించి రాష్ట్రవ్యాప్తంగా ఉన్నతాధికారుల చేత ప్రశంసలను అందుకున్నారు. అంతేకాక 2020 సెప్టెంబర్ నుంచి భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో మిడ్ వైఫరీ లెడ్ కోర్ యూనిట్ (ఎంఎన్సీయు)ను ఏర్పాటు చేసి గర్భిణీ స్త్రీల కోసం ప్రత్యేకంగా ఓపిని సైతం నిర్వహిస్తున్నారు. గర్భం దాల్చిన స్త్రీలు ఏరియా ఆసుపత్రికి చికిత్సకు వచ్చే తొలి రోజుల్లోనే వారికి స్క్రీనింగ్ నిర్వహించి హై రిస్క్ డెలివరీ నా, లో రిస్క్ డెలివరీనా గుర్తించి, హై రిస్క్ డెలివరీ అవకాశం ఉన్న గర్భిణీ స్త్రీలను గైనకాలజిస్ట్ వద్దకు పంపిస్తుండగా, లోరిస్క్ డెలివరీ అవకాశం ఉన్న గర్భిణీ స్త్రీలను పర్యవేక్షిస్తున్నారు.



### ఆరోగ్యంపై ప్రభావం

**హెడ్ నర్స్ విజయశ్రీ**

సిజేరియన్ల ద్వారా కాన్పులు నిర్వహిస్తే పురిటినొప్పుల బాధనుంచి ఉపశమనం లబిస్తుంది. తదనంతర రోజుల్లో తల్లుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని వైద్యులు చెపుతు న్నారు. సుఖప్రసవం పొందిన తల్లులు ఆరోగ్యవం తంగా ఉంటున్నారు. వయసు మీదపడ్డావారిలో ఆ లక్షణాలు తక్కువగా ఉంటున్నాయి. తేజస్సుగా ఉంటున్నారు. వయసు తక్కువ ఉన్న వారిగా కనిపిస్తుంటారని విజయ శ్రీ అంటున్నారు. అదే సిజేరియన్ ల ద్వారా ప్రసవాలు నిర్వహించినట్టయితే శారీరక మార్పులు సహజంగానే సంభవిస్తాయని స్పష్టం చేస్తున్నారు. వీటిపై అవగాహన లేకపోవడంతో తల్లిదండ్రులు కూడా సిజేరియన్స్ ప్రోత్సహిస్తున్నారు. అందుకే గర్భిణీ స్త్రీలకు సాధారణ కాన్పులపై అవగాహన కల్పించడమే కాకుండా ఏడు నెలలు నిండిన గర్భిణీ స్త్రీలకు క్రమం తప్పకుండా కౌన్సిలింగ్ సైతం ఇస్తున్నాం.

### సాధారణ కాన్పులు ప్రోత్సహించడమే లక్ష్యం

**డాక్టర్ ఎం. రామకృష్ణ, సూపరింటెండెంట్**



ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సిజేరియన్ ద్వారా కాన్పులు నిర్వహిస్తే పురిటినొప్పుల బాధనుంచి ఉపశమనం లబిస్తుంది. తదనంతర రోజుల్లో తల్లుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. అందుకే సిజేరియన్ ఆపరేషన్లను తగ్గించి సాధారణ కాన్పులను ప్రోత్సహించడమే లక్ష్యంగా మిడ్ వైఫరీ బృందం భద్రాచలం ఏరియా ఆసుపత్రి కేంద్రంగా విశేష కృషి చేస్తుంది. గడచిన ఐదేళ్లలో 6000 కు పైగా సాధారణ కాన్పులను జరిగేలా గర్భిణీ స్త్రీలను ప్రోత్సహించడం జరిగింది.

# ఇదిగో ఈ చెట్టే.. మాకు బొమ్మ చూపిస్తుంది

**ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌కు కారణం ఇదే**

**అపోహనా.. నిజమా.. తేల్చాలి**

**చెట్లు కొట్టేయాలని డిమాండ్**

*చంద్రుగొండ, అక్టోబర్ 26, ప్రజా జ్యోతి:*





ఆ చెట్లు ఏపుగా ఎదిగాయి. నీడను కూడా ఇస్తున్నాయి. హరితహారం లో వేసిన చెట్లు మాకు చల్లని నీడనిస్తున్నాయి అంతవరకు బాగానే ఉంది. ఆ చెట్ల నుండి ఎప్పుడైతే పూలు పూస్తున్నాయో అప్పుడే చిక్కులు కూడా వచ్చాయి. సాయంత్రం అయితే చాలు ఆ చెట్టు యొక్క పూల నుండి చెడువాసన ఆ బజారులో వ్యాపిస్తుండటంతో అర్థం కాని పరిస్థితిలో ఎంపీడీవో కార్యాలయ వెళ్లే రహదారి కిరువైపులా నివాసముంటున్న వారి పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లే రహదారికి ఇరువైపులా గత ప్రభుత్వంలో హరితహారంలో వేసిన చెట్లు ఇప్పుడు వారికి శాపంలా మారాయి. సాయంత్రం పూట చెట్ల పూల నుండి వచ్చే వాసన ఘాటుగా ఉంటూ చెడువాసన వస్తుండడంతో ఏంటా అని అర్థం చేసుకునే లోపే నరుకుల్ల లక్ష్మీనరసమ్మకు ఊపిరితిత్తులకు సంబంధించిన ఇన్ఫెక్షన్కు గురైనట్లుగా వైద్యులు చెప్పారు. అప్పటికి కూడా వారు ఆ చెట్టు పూల నుండి వచ్చే వాసనే ఊపిరితిత్తుల వ్యాధికి కారణం అని తెలుసుకోలేకపోయారు. అదే క్రమంలో వారి కుమారుడు కి కూడా సాయంత్ర వేళలో ఒక రకమైన ఊపిరితిత్తుల సంబంధించిన ఇబ్బందులు కలుగుతుండడంతో ఆ చెట్టు నుండి వచ్చే వాసనేనని అనుమానించడం మొదలుపెట్టారు. ఈ విషయం అచుట్టుపక్కల వారికి తెలియడంతో ఇద్దరు ముగ్గురు తమ ఇళ్ల వద్ద పెరిగిన చెట్లను కొట్టివేశారు. అటుగా వెళ్లిన విలేకరులకు చెట్లు కొట్టేసిన దృశ్యం కనబడటంతో ఆరా తీయడంతో ఈ విషయం కాస్త బయటకు వచ్చింది. వాస్తవంగా ఆ చెట్టు నుండి వచ్చే ఘాటు వాసన వల్లనేనా అని తెలుసుకోవాల్సి ఉంది. ఆ చెట్టుకు ఏడ ఆకులు తో చెట్లు వేపుగా పెరిగి ఉండటంతో దానికి ఏడాకుల చెట్లని వారు చెప్పారు. ఏది ఏమైనాప్పటికీ ఆ చెట్ల వల్ల ఇబ్బంది ఉన్నదా లేదా అనే విషయం అధికారులు దృష్టి సారించి అది అపోహ అయితే వారికి అవగాహన కలిగించాలి వాస్తవం అయితే ఆ చెట్లను ఎక్కడున్నా తొలగించాలి.

## మండల నూతన పశువైద్యాధికారిగా జెట్టి వివేక్ బాధ్యతలు

*ఆళ్ళపల్లి, అక్టోబర్ 26, ప్రజాజ్యోతి*



మండల కేంద్రంలోని ప్రాథమిక పశు వైద్య కేంద్రంలో శనివారం పశువైద్యాధికారిగా జెట్టి వివేక్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన బాధ్యతలు స్వీకరించిన రోజు మండల కేంద్రానికి చెందిన రైతు మద్దెల వెంకటేశ్వర్లు గేదె ఈనుటకు ఇబ్బంది పడుతున్న పరిస్థితి తెలుసుకొని చికిత్సను అందించి గేదెల దూడను సురక్షితంగా సంరక్షించడం జరిగింది. ఈ సందర్భంగా పశువైద్యాధికారి వివేక్ మాట్లాడుతూ పశు సంవర్థక శాఖ తనపై ఉంచిన బాధ్యతను నిర్వర్తిస్తానని, అన్నారు. పశువులు ఏదైనా అనారోగ్యానికి గురైతే నేరుగా మండల కేంద్రంలోని ప్రాథమిక పశువైద్య కేంద్రానికి తీసుకురావాలని ఒకవేళ తీసుకురావాలని పరిస్థితి ఉంటే ఆ సిబ్బంది సంప్రదిస్తే అక్కడికి వచ్చి వైద్యం అందించడం జరుగుతుంది తెలిపారు కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది రోళ్ళకంటి రమేష్ బాబు లైవ్ స్టాక్ అసిస్టెంట్ దనపు గణేష్ ఆఫీస్ సబార్డినెంట్ గోపాలమిత్రలు సయ్యద్ యునుస్ పాషా , కొమరం సుధాకర్ , కొమరం నారాయణ మైత్రిలు సర్వ సంపత్ , గొగ్గేల సుజాత , ఇర్ప నాగేశ్వరరావు పాల్గొన్నారు

## మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

**విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించిన ఎంఈఓ**



*చంద్రుగొండ, అక్టోబర్ 26, ప్రజాజ్యోతి:*



విద్యార్థుల సామర్థ్యాన్ని మండల విద్యాశాఖ అధికారి ఎం సత్యనారాయణ పరిశీలించారు. శనివారం మండల పరిధిలోని తిప్పనపల్లి తండా గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా విద్యాశాఖ మండల అధికారి ఎం సత్యనారాయణ సందర్శించి విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. విద్యార్థుల నుండి పాఠ్యాంశాల వారీగా ప్రశ్నలు సంధించి వారి నుండి సమాధానాలు రాబట్టారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇస్లావత్ వీరన్న, ఉపాధ్యాయుడు నాను, సిఆర్పి శ్రీను ఉన్నారు.

## రైతులు మునగ సాగు తో అదనపు ఆదాయం పొందవచ్చు

**–ఎంపీడీవో విజయభాస్కర రెడ్డి**



*పాల్వంచ, అక్టోబర్ 26, ప్రజాజ్యోతి:*

రైతులు అంతర పంటగా మునగ సాగు తో స్థిరమైన అదనపు ఆదాయం పొందవచ్చునని ఎంపీడీవో విజయభాస్కర రెడ్డి సూచించారు. శనివారం పాండురంగాపురం, పాండురంగాపురం తండా, తవిసలగూడం గ్రామపంచాయతీ రైతులకు మునగ సాగుపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. నీటి సౌకర్యం ఉన్న చిన్న సన్నకారు రైతులు, కొత్తగా వేసిన ఆయిల్ ఫామ్ తోటలో, ఇతర పంటలతో కలిపి మునగ సాగు చేయవచ్చని ఏడు నుండి ఎనిమిది నెలల లో పంట కోతకు వస్తుంది, ఆరు నెలలకు ఒకసారి కొమ్మలు కత్తిరించి వాటి ఆకులు, ఎండిన కాయల గింజల ద్వారా కూడా ఆదాయం పొందవచ్చునని తెలియజేశారు. మునగ సాగుకు మొక్కల కొనుగోలు, నాటడం, నీరు పోసి సంరక్షించడం, ఊత కర్ర కట్టడానికి ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వమే ఒక ఎకరానికి రూ.1,22,391/–భరిస్తుందని కాబట్టి దీనిని అందరూ రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ బొగ్గ నారాయణ, ఏవో శంభో శంకర, ఏపీఓ పోరండ్ల రంగా, ఏపిఎం రాంబాబు, ఈసీ పుల్లయ్య, ఏఈఓ అనురిక, కార్యదర్శులు ప్రభాకర్, విజయలక్ష్మి , కాలి, సంధ్య రాణి, కమ్యూనిటీ కోఆర్డినేటర్ శ్రీను, క్షేత్ర సాంకేతిక సహాయకులు వీరన్న, శ్రీను పాల్గొన్నారు.

## అయోడిన్ లోప రుగ్మతులపై అవగాహన



*టేకులపల్లి, అక్టోబర్ 26, ప్రజాజ్యోతి:*

మండల వైద్యాధికారి డాక్టర్ కందుల దినేష్ ఆధ్వర్యంలో శనివారం టేకులపల్లిలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు, ఉపాధ్యాయ సిబ్బందికి అయోడిన్ లోపం వల్ల కలిగే రుగ్మతల పై అవగాహన కల్పించి అనంతరం వైద్య శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యం కావాలంటే మానవ శరీరానికి సూక్ష్మ పోషకం అయిన అయోడిన్ ఎంతో ముఖ్యమని అయోడిన్ లోపం వల్ల ముఖ్యంగా స్త్రీలలో అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయని, గర్భవతుల్లో, పాలిచ్చే తల్లులకి ఎక్కువ అయోడిన్ అవసరం ఉంటుందని అయోడిన్ లోపం వల్ల అధిక బరువు గర్భధారణ లో లోపాలు, గర్భస్రావం నిర్జీవ జననం పుట్టిన శిశువుకి మెదడు అభివృద్ధిలో లోపాలు తద్వారా పిల్లల్లో వయసుకు తగ్గ ఎదుగుదల లేకపోవడం జ్ఞాపకశక్తి తగ్గడం చదువుల్లో ఆటల్లో ప్రతిభ చూపలేకపోవడం పుట్టుకతో చెవుడు, మూగతనం మరుగుజ్జుతనం, కండరాలు బిగిసుకుకపోవడం, జుట్టు ఊడిపోవడం, కిడ్నీ సమస్యలు, కాలేయ సమస్యలు, గాయిటర్ వ్యాధి వంటి ఎన్నో ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని కనుకనే భారత ప్రభుత్వం అయోడిన్ చేర్చిన ఉప్పుని మాత్రమే అమ్మాలని ఆదేశించిందని ఉప్పు ప్యాకెట్ పై అయోడిన్ కలిపినట్లు నిర్ధారించే లోగో ఉన్న ఉప్పు ప్యాకెట్ మాత్రమే కొనుగోలు చేయాలని దీనితోపాటు సహజంగా అయోడిన్ లభించే ఆహార పదార్థాలైన సముద్రపు చేపలు, రొయ్యలు గుడ్లు, పాలు, పాల పదార్థాలు అన్ని రకాల తాజా ఆకుకూరలు, కాయకూరలు తదితర ఆహార పదార్థాలు తీసుకోవడం ద్వారా కూడా అయోడిన్ లోపం రాకుండా నివారించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంతు , ఆరోగ్య విస్తరణ అధికారి దేవా, సూపర్వైజర్ నాగుబండి వెంకటేశ్వర్లు, ఆరోగ్య సహాయకురాలు సులోచన, చంద్రకళ, స్టాఫ్ నర్స్ సీత , ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు లక్ష్మి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ చీరలు ఇప్పుడా ఇచ్చేది

**మండల బిజెపి అధ్యక్షులు భోగి కృష్ణయ్య**

**చీరల పంపిణీ అన్ని వర్గాలకు అందజేయాలి**



*చంద్రుగొండ, అక్టోబర్ 26, ప్రజా జ్యోతి:*

బతుకమ్మ వెళ్ళింది దసరా పండుగ సంబరాలు ముగిశాయి దీపావళి కూడా వస్తుంది ఇప్పుడా బతుకమ్మ చీరలు పనిచేయదని చంద్రుగొండ మండల బిజెపి అధ్యక్షులు భోగి కృష్ణ విమర్శిస్తున్నారు. సందర్భంగా మండలంలో బతుకమ్మ చీరలో పంపిణీని శనివారం బిజెపి మండల అధ్యక్షుడు బోగి కృష్ణయ్య సందర్శించి విలేకరులతో మాట్లాడారు. బతుకమ్మ ముగిశాక చీరలు పంపిణీ ఏమిటని అది కూడా డ్వాక్రా మహిళలకు మాత్రమే ఇవ్వటం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. 18 సంవత్సరాల నిండిన ఎస్టీ మహిళలకు కూడా పంచుతున్నారని మిగిలిన వారు అర్హులు కారా అని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే బతుకమ్మ చీరలు అన్ని వర్గాల మహిళలకు పంచాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీజేవైఎం అధ్యక్షులు భూక్యరాంపండు పాల్గొన్నారు.

## 'ఓపెన్ స్కూల్' ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

**పాల్వంచ, అక్టోబర్ 26, ప్రజాజ్యోతి:**



తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించే ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్ లో ప్రవేశాలకు అక్టోబర్ 31వ తేది వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్టార్ చిల్డ్రన్ హైస్కూల్ ఏఐ కోఆర్డినేటర్ జి. భాస్కర్ రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చదువు మధ్యలో మానేసినవారు, గృహిణిలు, వ్యాపార రంగంలో ఉన్నవారు, ఉద్యోగంలో ప్రమోషన్స్ పొందగోరేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9866806532 నంబర్ ను సంప్రదించాలని తెలియజేశారు.

## డ్రైవర్లు పొరపాట్లకు తావివ్వొద్దు..

### ఎంవీఐ వెంకట పుల్లయ్య



**భద్రాచలం, అక్టోబర్ 26, ప్రజాజ్యోతి:**

భద్రాచలం లోని ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న డ్రైవర్లు ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా జాగ్రత్తగా అధికారులు చెప్పినట్లు విధులు నిర్వర్తించాలని భద్రాచలం ఎంవీఐ వెంకటపుల్లయ్య అన్నారు. శనివారం జిల్లా తెలంగాణ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం జిల్లా కన్వీనర్ వనమా శ్రీనివాసరావు , డివిజన్ అధ్యక్షులు రాఘవులు, సభ్యులు ఎంవీఐ వెంకటపుల్లయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. భద్రాచలం పట్టణం కూనవరం రోడ్డులోని ఎం.వి.ఐ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంవీఐ వెంకట పుల్లయ్యను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంవిఐ వెంకట పుల్లయ్య మాట్లాడుతూ అజాగ్రత్తగా డ్రైవర్‌లు విధులు నిర్వహించి అనుకోని సంఘటనలు ఏమైనా జరిగితే అధికారులతో పాటు మన కుటుంబాలు కూడా బాధపడాల్సిన పరిస్థితి ఉంటుందని అన్నారు. డ్రైవర్లకు ఏమైనా వ్యక్తిగత సమస్యలు, కార్యాలయం పరంగా సమస్యలు ఉంటే తనను నేరుగా సంప్రదించవచ్చని అన్నారు .తమ సమస్యలు పరిష్కరించి, నా యొక్క సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు . ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డ్రైవర్ల సంఘం కో కన్వీనర్ , డివిజన్ అధ్యక్షులు రాఘవులు, కోకాన్వీనర్ నాగరాజు, సభ్యులు బిక్షం, వెంకట్రామిరెడ్డి ,జూమ్ లాల్, మర్నాద్, జానీ తదితరులు పాల్గొన్నారు.

## వర్ధంతి సభను జయప్రదం చేయండి

**గుండాల, అక్టోబర్ 26, ప్రజాజ్యోతి**



పిడిఎస్‌యు నిర్మాతలు చంద్రశేఖర్ ప్రసాద్ నీలం రామచంద్రయ్య వర్ధంతి సభను నవంబర్ 5న ఇల్లందులో జరగనున్నట్లు ఈ సభను జయప్రదం చేయాలని పిడిఎస్‌యు ఇల్లెందు డివిజన్ కార్యదర్శి బానోత్ నరేందర్ ఒక ప్రకటనలో కోరారు శనివారం గుండాలలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగిందన్నారు ఉమ్మడి ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఇల్లెందులో వర్ధంతి సభను నిర్వహిస్తున్నట్లు ఆ సభకు మేధావులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు చార్జి రెడ్డిని మతోన్మాద శక్తులు దాడి చేసి చంపారని జార్జి ఆశయాలను భుజాన వేసుకొని చంద్రశేఖర్ ప్రసాద్ జెండా ఎత్తుకొని అనేక ఉద్యమాలు నిర్వహించాలన్నారు ఆనాటి ఇంద్ర రాజ్యం లో చంద్రశేఖర్ ప్రసాద్ ను ఇల్లందులో చీకటిగనులో నవంబర్ 5న కాల్చి చంపారని వారి ఆశయ సాధనలో పిడిఎస్ యు అనేక విద్యార్థి ఉద్యమాలను నిర్వహిస్తూ వస్తుందన్నారు శాస్త్రీయ విద్యా విధానానికై అనేక పోరాటాల నిర్వహిస్తూ వస్తుందన్నారు ఈ కార్యకర్తల సమావేశంలో జస్వంత్ ప్రశాంత్ శ్రీనివాస్ ప్రకాష్ మధుమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధికి రూ.4.50లక్షలతో తాత్కాలిక పాఠశాల ఏర్పాటు

### –భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్

**భద్రాచలం, అక్టోబర్ 26, ప్రజాజ్యోతి:**





ప్రతి విద్యార్థికి చదువే పునాది అని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. శనివారం దుమ్ముగూడెం మండల పరిధిలోని పాత నారాయణరావుపేటలో గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధి కొరకు ఏర్పాటు చేసిన తాత్కాలిక పాఠశాలను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ గ్రామంలో చిన్నారుల విద్యకు సంబంధించి ఇటీవల ఐటీడీఏకు వచ్చి గ్రామస్తులు తనను విన్నవించారని, గిరిజన బాల, బాలికలు చదువుపై ఎంతో ఆసక్తితో ఉన్నప్పటికీ వారికి సమీపంలో పాఠశాల లేకపోవడంతో పాటు జీపీఎస్ పాఠశాలలు దూరంగా ఉండటంతో ఈ సమస్యను పరిష్కరించాలనే ఉద్దేశ్యంతో ఐటీడీఏ నుంచి రూ.4.50లక్షలు నిధులు మంజూరు చేయించి గ్రామంలో తాత్కాలిక పాఠశాలను ఏర్పాటు చేయించామన్నారు. ఇప్పుడు తానే స్వయంగా ఈ పాఠశాలను ప్రారంభించి విద్యార్థులకు విద్యావకాశం కల్పించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పాఠశాలను ప్రారంభించిన అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, పెన్సిళ్లు తదితర విద్యాసామాగ్రిని అందజేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్నతనం నుంచే కోయబాష నేర్చుకునేలా అవగాహన కల్పించాలని, బాషా, సంస్కృతి, ఆచార వ్యవహారాలు తప్పనిసరిగా పిల్లలకు వివరించాలన్నారు. తల్లిదండ్రులతో ఇంట్లో, పాఠశాలలో తోటివారితో ఆదివాసీ బాషనే మాట్లాడుకోవాలని, పిల్లలు ఉన్నతంగా చదివి అనుకున్న లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం బొజ్జిగుప్పలో పాతకాలపు మట్టితో కట్టిన ఇంటిని పరిశీలించి ఇలాంటి ఇంటి నిర్మాణం భద్రాచలంలోని ట్రైబల్ మ్యూజియంలో చేపట్టాలని మ్యూజియం ఇన్చార్జ్ వీరాస్వామికి సూచించారు పాత నారాయణరావుపేటలో తాత్కాలిక పాఠశాలను ఏర్పాటు చేసి విద్యాభివృద్ధికి బాటలు వేసిన ఐటీడీఏ పీవోను గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందించి కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ తానాజీ, డీఈ హరీష్, ఏఈ రవి, నారాయణరావుపేట పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్, సర్వేశ్వరదొర, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పవర్ లిఫ్టింగ్ క్రీడాకారునికి ఘనసన్మానం



**భద్రాచలం, అక్టోబర్ 26, ప్రజాజ్యోతి:**

ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టింగ్ క్రీడాకారుడు మొడెం వంశీను పట్టణ ప్రముఖులు పామరాజు తిరుమలరావు, కడాలి నాగరాజు, లకావత్ వెంకటేశ్వర్లు ల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు . శనివారం పెన్షనర్ల సంఘ భవనంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ప్రముఖులు మాట్లాడుతూ... సౌతాఫ్రికాలో జరిగిన ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 677.50 కిలోల విభాగంలో ప్రథమస్థానంతో పాటు జాతీయ పోటీల్లో 15 పతకాలు సాధించిన మొడెం వంశీ మన భద్రాచలం ప్రాంతవాసి కావడం గర్వకారం అని అన్నారు .రానున్న రోజులలో మరెన్నో విజయాలు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేసారు . అనంతరం వంశీ కు 5 వేల రూపాయలు అందజేశారు . మొడెం వంశీ ను తీర్చిదిద్దిన జిమ్ నిర్వాహకులు గొంగడి రామిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘము అధ్యక్షులు భూషణావు, చిట్టే లలిత, హనుమంతరావు, శేఖర్ మాస్టర్, మణికుమారి, పూసం రవికుమారి, రామరాజు ,జిమ్ ట్రెజరర్ వెంకటకృష్ణ మహంతి ,గోళ్ళ భూపతిరావు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా శక్తి పథకం ద్వారా మహిళలు ఆర్థిక పురోగతి సాధించాలి

### –మండల పరిషత్ అభివృద్ధి అధికారి జమలారెడ్డి




**బూర్గంపాడు, అక్టోబర్ 26, ప్రజాజ్యోతి**

మహిళా శక్తి పథకం ద్వారా మహిళలు ఆర్థిక పురోగతి సాధించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి జమలారెడ్డి అన్నారు. ఇందిరా మహిళ శక్తి పథకంలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం మండల కేంద్రంలో ఇందిరా మహిళా శక్తి ఫుడ్ కోర్టును ఐకేపీ ఏపీఎం నాగార్జున ఆధ్వర్యంలో ముఖ్యఅతిథిగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి జమలారెడ్డి హాజరై క్యాంటీన్ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి ఫుడ్ కోర్టును ఏర్పాటు చేసిన గౌతమిపురం కాలనీకి చెందిన ప్రభు మహిళా సంఘ సభ్యురాలు బండ్ల అజ్మీరా ఈ క్యాంటీన్ ద్వారా ఆర్థిక పురోగతి సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ తాతారావు, మండల వ్యవసాయ శాఖ అధికారి ఆర్ శంకర్, ఎంపీవో సునీల్ శర్మ, ఏఈవో ప్రసాద్, సీసీలు తులసి, లీలావతి, అరుణ, ఉపాధి హామీ పథకం సిబ్బంది, గ్రామ సమాఖ్య మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## జీఎంను అభినందించిన ఎమ్మెల్యే

**ఇల్లందు, అక్టోబర్ 26, ప్రజాజ్యోతి:**




సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియా జెకె5 ఓసికి ఫైవ్ స్టార్ అవార్డు వచ్చినందుకు గాను శనివారం ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఏరియా జియం జాన్ ఆనంద్ ను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలోని ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బొగ్గు ఉత్పత్తి కంపెనీలలో గల ప్రమాదరహిత గనులకు కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ప్రతి ఏడాది అందజేస్తున్న ఫైవ్ స్టార్ అత్యుత్తమ గనుల అవార్డుకు ఈసారి సింగరేణి ఇల్లందు ఏరియాలోని జవహర్ ఖని 5 ఓపెన్ కాస్ట్ గనికి రావడం సంతోషకరమన్నారు. ఈ నెల 21న న్యూఢిల్లీలోని స్కోప్ కన్వెన్షన్ సెంటర్లో జరిగిన బహుమతి ప్రదానోత్సవ వేడుకలో ఈ అవార్డులను కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, కేంద్ర బొగ్గు శాఖ సహాయ మంత్రి సతీష్ చంద్ర దూబే చేతుల మీదుగా ఏరియా జియం ఈ అవార్డు అందుకున్నట్లు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన కొన్ని ఫైవ్ స్టార్ రేటింగ్ గనుల్లో సింగరేణి సంస్థ జేకే ఉపరితల గని కూడా నిలవడం, సింగరేణికి రక్షణపై గల నిబద్ధతకు ఈ అవార్డు నిదర్శనమని తెలిపారు. ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించడం కోసం కృషి చేసిన గని అధికారులు రక్షణపై తీసుకుంటున్న ప్రత్యేక చర్యలు, రక్షణపై ఇస్తున్న సూచనల అమలుతో పాటు కార్మికులను చైతన్య పరుస్తున్న నేపథ్యంలో ఈ గనిలో ప్రమాదాల సంఖ్య దాదాపు శూన్యం స్థాయికి చేరుకుందన్నారు. ఈ ఫైవ్ స్టార్ రేటింగ్ కోసం కృషి చేసిన అధికారులు, ఉద్యోగులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిజియం (పర్సనల్) జివి. మోహన్ రావు, ఐఎన్టియుసి ఏరియా ఉపాధ్యక్షుడు జె. వెంకటేశ్వర్లు, యూనియన్ నాయకులు గోచికొండ సత్యనారాయణ, మహబూబ్, బాబు రావు, అన్వర్, నాగేశ్వరరావు, మధు కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ నాయకులు, వివిధ విభాగాలు, గనుల పిట్ కార్యదర్శులు పాల్గొన్నారు.

# మంత్రి పొంగులేటి జన్మదిన వేడుకలను ఘనంగా జరపాలి : కొత్వాల

**పాల్వంచ, అక్టోబర్ 26, ప్రజాజ్యోతి:**



తెలంగాణా రాష్ట్ర రెవిన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదినం ఈ నెల 28 తేదీన జరుగనున్నదని, కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు ఆయన జన్మదిన వేడుకలను ఘనంగా జరపాలని డీసీఎంఎస్ చైర్మన్, రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాల్వంచ పట్టణ పరిధిలోని అయ్యప్ప నగర్ లో శనివారం కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ.. సోమవారం జరిగే శీనన్న జన్మదిన కార్యక్రమాల్లో భాగంగా పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రి వద్ద బర్త్ డే కేక్ కటింగ్, రక్తదాన శిబిరం, రోగులకు పండ్లు రొట్టెల పంపిణీ కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు.పొంగులేటి మరింత అభివృద్ధి చెందాలని కాంక్షిస్తూ హిందూ, ముస్లిం,క్రైస్తవదేవాలయాల్లో పూజలు, అనాధలకు అన్నదానం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నామని కొత్వాల అన్నారు.

**రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను జయప్రదం చేయండి**

మంత్రి పొంగులేటి జన్మదినం సందర్భంగా ఈ నెల 28,29,30 తేదీలలో కొత్తగూడెం ప్రకాశం స్టేడియం గ్రౌండ్ లో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నారని,కాంగ్రెస్కార్యకర్తలు,అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కొత్వాల పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు యర్రంశెట్టి ముత్తయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొండం వెంకన్న, పెద్దమ్మ గుడి మాజీ చైర్మన్ మహిపతి రామలింగం, కందుకూరి రాము, చింతా నాగరాజు, కాపర్తి వెంకటాచారి, నాగి రెడ్డి, ఎస్ కె చాంద్ పాషా, పాబోలు నాగేశ్వరరావు, పులి సత్యానారాయణ, ధర్మసోత్ ఉపేందర్, ఉండేటి శాంతివర్ధన్,మాలోత్ కోటి,నవభారత్ రాము,సూర్యకిరణ్,గంధం నరసింహ రావు, సాంబయ్య, పాకాలపాటి రోశయ్య చౌదరి, మస్నా శ్రీనివాస రావు, బానోత్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ అమరవీరుల ఆశయ సాధనే తమ లక్ష్యం





**ఇల్లందు, అక్టోబర్ 26, ప్రజాజ్యోతి:**

విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీస్ అమరవీరుల ఆశయ సాధనే తమ లక్ష్యమని ఇల్లందు డివిస్పి ఎన్. చంద్రభాను తెలిపారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్స వాలలో భాగంగా శనివారం స్థానిక పాత బస్టాండ్ వద్ద గల ఐత ఫంక్షన్ హాల్ లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డివిస్పీ మాట్లాడుతూ అన్ని దానాల కన్నా రక్తదానం ఎంతో గొప్పదన్నారు. రక్తాన్ని దానం చేయడం వల్ల ప్రమాదం లో ఉన్నవారికి ఈ రక్తంతో వారికి జీవితాన్ని ప్రసాదించిన వారమవుతామని పేర్కొన్నారు. అనంతరం రక్తదానం చేసిన పలువురికి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు, టేకులపల్లి సీఐలు బత్తుల సత్యనారాయణ, తాటిపాముల సురేష్, ఇల్లందు సబ్ డివిజన్ పరిధిలోని ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్ కుటుంబానికి ఐటీడీఏ పీవో ఆర్థిక సాయం



**భద్రాచలం, అక్టోబర్ 26, ప్రజాజ్యోతి:**

గోదావరి వరదల సమయంలో వరద ముంపు ప్రాంతాలైన అశ్వాపురంలోని గొంది గూడెం గ్రామం నుండి అశ్వాపురం వస్తుండగా అకస్మాత్తుగా వచ్చిన వరదలలో ఆటో కొట్టుకుపోవడంతో కుటుంబాన్ని పోషించుకోవడం ఇబ్బంది పడుతున్నానని పిఓ దృష్టికి తీసుకురాగా కుటుంబాన్ని పోషించుకోవడానికి 25 వేల రూపాయల ఆర్థిక సహాయం కుటుంబ పోషణ కోసం అందించడం జరిగిందని పినపాక శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం ప్రాజెక్టు అధికారి చాంబర్. లో సందీప్ అనే ఆటో డ్రైవర్ కు ప్రాజెక్ట్ అధికారి చేతుల మీదుగా 25 వేల రూపాయల చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు ఆటో నడుపుకొని జీవనోపాధి పొందుతున్న సందీప్ ఆటో కొట్టు కుపోవడంతో కుటుంబాన్ని పోషించుకోవడం ఇబ్బంది పడుతున్నానని తన దృష్టికి తీసుకురాగా , వెంటనే పి ఓ దృష్టికి తీసుకవెళ్లగా ఆయన స్పందించి ఐటీడీఏ రిలీఫ్ ఫండ్ నుండి జీవనోపాధి పెంపొందించుకోవడానికి ఆర్థిక సాయం అందించారని, ఆ చెక్కును ఐటీడీఏ పీవో బి. రాహుల్ చేతులమీదుగా సందీప్ ఆటో డ్రైవర్ కు అందించినట్లు ఆయన అన్నారు. అలాగే గొంది గూడెం గ్రామంలోని పోడు వ్యవసాయం చేసుకుంటున్న గిరిజన రైతులకు అర్హత మేరకు పాయం మల్లమ్మ, కన్నయ్య, గొల్లపల్లి శ్రీనివాస్, సుమలత, కనితిరత్తమ్మ, పాయం వీరనారాయణ, కలబోయిన ముత్తయ్యలకు పంట భూములకు సంబంధించిన పెండింగులో ఉన్న పోడు పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిటిఆర్ఓఎఫ్ఆర్ లక్ష్మీనారాయణ, ఏడి అగ్రికల్చర్ భాస్కర్, పట్టాదారులు పాల్గొన్నారు.

## స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేసేంతవరకు పోరాడుతాం

**ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు బోడ అభిమిత్ర**



**జూలూరుపాడు, అక్టోబర్ 26,ప్రజాజ్యోతి :**

భారత విద్యార్థి ఫెడరేషన్ జూలూరుపాడు మండలం కమిటీ ఆధ్వర్యంలో మండల తహసిల్దార్ గారికి విద్యారంగ సమస్యల మీ వినతి పత్రం అందజేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు బోడ అభిమిత్ర మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్లో ఉన్న 8300 కోట్ల స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ డిగ్రీ,పీజీ,ఇంటర్మీడియట్ ,పారామెడికల్ కళాశాల యాజమాన్యాలు స్వయంగా కళాశాల బంద్ పెట్టి ఆందోళన చేస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం నిద్రపోతుందా అని ప్రశ్నించారు. పేద మధ్యతరగత విద్యార్థులకు అందించే స్కాలర్షిప్ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల పట్ల సవతి తల్లి ప్రేమ చూపిస్తుందని అన్నారు. ప్రైవేట్ కళాశాలలో చదువులు పూర్తిచేసుకుని పై చదువులకు పోవాలంటే స్కాలర్షిప్ రాలేదు ఫీజ రియంబర్స్మెంట్ రాలేదు ఫీజు కట్టి సర్టిఫికెట్లు తీసుకోవాలని చెప్పేసి యాజమాన్యాలు , ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లు విద్యార్థులకు ఇబ్బందులు పెట్టడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో మార్పు రావాలి అంటే కాంగ్రెస్ రావాలి అని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత పేద మధ్యతరగతి కుటుంబాల బతుకులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు, పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని లేని పక్షంలో భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులను కూడగట్టి బలమైన ఉద్యమాలు నిర్మించి ప్రభుత్వం మీద బలమైన విద్యార్థి ఉద్యమాలు నిర్వహిస్తామని అన్నారు, విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడితే విద్యార్థులు తలుచుకుంటే ప్రభుత్వ పునాదులు కదులుతాయని, చరిత్రను కాంగ్రెస్ ప్రభుత్వం మర్చిపోవద్దు అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పి పవన్, కిషోర్, సాయి, ప్రశాంత్, రవి పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యకు స్వర్ణ తులసి పూజలు

**భద్రాచలం, అక్టోబర్ 26, ప్రజాజ్యోతి:**



భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో స్వామివారి ఉత్సవమూర్తులకు శనివారం అర్చకులు స్వర్ణతులసి పూజలు జరిపారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలిహరణం తదితర నిత్యపూజలు చేశారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణమూర్తులను బేడా మండపానికి తీసుకువచ్చి నిత్యకల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న దాతలకు ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

## ఇల్లందు మున్సిపల్ కమిషనర్ బదిలీ

**–నూతన కమిషనర్ గా శ్రీకాంత్**

**ఇల్లందు, అక్టోబర్ 26, ప్రజాజ్యోతి:**

రాష్ట్రవ్యాప్తంగా శనివారం జరిగిన మున్సిపల్ కమిషనర్ ల బదిలీలలో భాగంగా ఇల్లందు మున్సిపల్ కమిషనర్ యాదగిరి మణుగూరు మున్సిపల్ కమిషనర్ గా బదిలీ అయ్యారు. ఇల్లందు మున్సిపల్ కమిషనర్ గా రామగుండం మున్సిపల్ కమిషనర్ గా విధులు నిర్వహిస్తున్న శ్రీకాంత్ ను బదిలీ చేశారు.

## మాలల ఆత్మగౌరవ సభ ను జయప్రదం చేయండి : దాసరి శేఖర్

**భద్రాచలం, అక్టోబర్ 26, ప్రజాజ్యోతి**



ఎస్సీ వర్గీకరణ కు వ్యతిరేకంగా ఆదివారం నాగర్ కర్నూల్ లో జరిగే మాలల ఆత్మ గౌరవ సభను జయప్రదం చేయాలనీ ఎస్సి వర్గీకరణ పోరాట సమితి జిల్లా కో కన్వీనర్ దాసరి శేఖర్ పిలుపు నిచ్చారు.శనివారం అంబెద్కర్ సెంటర్ లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో అయన మాట్లాడుతూ.. భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా మాల సోదరులు, మాల ఉద్యోగస్తులు ,విద్యార్థులు ,అంబేద్కర్ అభిమానులు ,మాల మహిళలు రిటైర్డ్ ఉద్యోగస్తులు, మాల వ్యాపారస్తులు ,మాల రైతులు లక్షలాదిగా తరలివెళ్లి మాలలు ఐక్యత ను చాటాలని అన్నారు .

## పాల్వంచ మున్సిపల్ కమిషనర్ బదిలీ

**పాల్వంచ, అక్టోబర్ 26, ప్రజాజ్యోతి :**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మున్సిపల్ కమిషనర్ డాకు నాయక్ శనివారం బదిలీ అయ్యారు. ఈ మేరకు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.కామారెడ్డి మున్సిపల్ కమిషనర్ గా విధులు నిర్వహిస్తున్న సుజాతను పాల్వంచ మున్సిపల్ కమిషనర్ గా అధికారులు నియమించారు.

## రెండు గ్రామాలకు పాఠశాల ఏర్పాటు చెయ్యండి

**చర్ల, అక్టోబర్ 26, ప్రజా జ్యోతి:**

చర్ల మండలం కేంద్రంలో ఉన్న రాజయ్య నగర్, క్రాంతి పురం గ్రామాలలో ఉన్న విద్యార్థులకు పాఠశాల ఏర్పాటు చేయాలని, ఆదివాసి గిరిజన సంఘము డివిజన అధ్యక్షులు రేగ ఆంధ్రయ్య డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా ఇక్కడే నివాసం ఉంటున్న ఆదివాసులపై ప్రభుత్వం చిన్న చూపు చూస్తున్నదని విమర్శించారు. రెండు గ్రామాలు సుబ్బంపేట గ్రామపంచాయతీ పరిధిలో ఉన్నాయి. ఈ రెండు గ్రామాలకు సరైన మౌలిక సదుపాయాలు లేక, సుబ్బంపేట గ్రామపంచాయతీ పరిధిలో గల పాఠశాలకు రెండు కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ ఈ గ్రామ ప్రజలు పాఠశాలకు పిల్లలను పంపిస్తున్నారు. దట్టమైన అడవి ప్రాంతంలో ఉన్న ఈ గ్రామాలు. దారి మధ్యలో పిల్లలకు ప్రమాదం జరిగితే పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్న తల్లిదండ్రులు. స్కూలు దూరంగా ఉండడం కారణంగా కొంత మంది పిల్లలను వారి తల్లిదండ్రులు బడికి పంపించడం లేదని తెలిపారు. కావున అధికారులు ఇప్పటికైనా స్పందించి రాజయ్య నగర్, క్రాంతి పురం గ్రామాలకు పాఠశాల ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించవలసిందిగా తెలిపారు.

# చిన్నారి సాయి జాహ్నవిని పరామర్శించిన మాజీ ఎంపీ హర్ష కుమార్



బూర్గంపాడు, అక్టోబర్ 26, ప్రజాజ్యోతి

బూర్గంపాడు మండలంలోని మొరంపల్లి బంజర్ గ్రామానికి చెందిన పాత్రికేయులు పల్లంటి రమేష్ కుమార్తె చిన్నారి సాయి జాహ్నవికి ఇటీవల కాలుకు గాయమై హైదరాబాద్ ఆస్పత్రి చేర్చగా పరీక్షించిన వైద్యులు కాలుకు ఆపరేషన్ చేసి నెల రోజులు పాటు చికిత్స అందించారు. అనారోగ్యంతో ఇంటికి చేరిన చిన్నారి సాయి జాహ్నవి విషయాన్ని తెలుసుకున్న అమలాపురం మాజీ ఎంపీ హర్ష కుమార్ వారి నివాసానికి వచ్చి చిన్నారి సాయి జహ్నవిని పరామర్శించారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని భరోసానిచ్చారు.

# ఉపాధి పనులపై సామాజిక తనిఖీ



టేకులపల్లి, అక్టోబర్ 26, ప్రజాజ్యోతి :

టేకులపల్లి మండల పరిషత్ కార్యాలయం నందు ఎంజిఎన్ఆర్ఈజీఎస్ 15 వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికనుజిల్లాఅదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రవి నిర్వహించారు.ఈ ఆడిట్లో జరిగిన పనులు 575, కూలీల ఖర్చు 47762179,మెటీరియల్ 2580666 మొత్తం 50343385,24096 రికవరీ, పెనాల్టీ 22500 విధించారు.ఈ కార్యక్రమంలో ఎస్ టి ఎమ్సాయి జ్ఞానేందర్,జిల్లా విజిలెన్స్ అధికారి రమణ,ఎంపీడీవోరవీంద్ర రావు,అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి అనూష,అంబుడ్స్ మెన్ ప్రకాష్,క్వాలిటీ కంట్రోల్ అధికారి ప్రకాష్,ఎంపీ ఓ గాంధీ,స్టేట్ రిసోర్స్ పర్సన్ ఏ.రమేష్,ఏపీవో కాలంగి శ్రీనివాస్,ఈసీ తిరుపతయ్య,కార్యదర్శులు ఉపాధి హామి సిబ్బంది పాల్గొన్నారు.

# అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం





చర్ల, అక్టోబర్ 26, ప్రజా జ్యోతి:

చర్ల మండల స్థాయి అధికారులతో భద్రాచల నియోజకవర్గ స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొని వారి సమస్యలను స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. మండల కేంద్రంలో దిష్టవేసిన సమస్యలపై ప్రధాన చర్చ జరిగింది. మిషన్ భగీరథ, ఇరిగేషన్ డిపార్ట్మెంట్, ఐసిడిఎస్ ప్రోగ్రాం , ఐకెపి ఇబ్బందితో డ్వాక్రా మహిళలకు తీసుకున్న రుణాలను డెవలప్మెంట్ కోసం చర్చించడం జరిగింది , భూ సమస్యలు, చర్ల మండల కేంద్రంలో ఫైర్ స్టేషన్, పోస్టుమార్టంకి శాశ్వత భవనం , వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖ , రోడ్ల సమస్య, మంచినీటి సమస్యలు, ఆరోగ్యం పై పలు అంశాల పై అధికారులతో ముఖాముఖిగా స్థానిక ఎమ్మెల్యే మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తిప్పాపురం మాజీ సర్పంచ్ కన్నారావు ఆధ్వర్యంలో నీటి సమస్య ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖకు తెలిపారు. ప్రజలు కొంతమంది గ్రామపంచాయతీ సెక్రటరీల పై ఫిర్యాద్ లు చేశారు. వారిని ఎమ్మెల్యే పద్ధతి మార్చుకోవాలని, లేనిపక్షంలో చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పలు సమస్యలను తెలుసుకున్న ఎమ్మెల్యే, ముఖ్యమంత్రి, మంత్రుల దృష్టికి తీసుకెళ్లి, త్వరగా వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, ఎమ్మార్వో, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ సిడిపిఓ, ఐకెపి ఎపిఎం, సీసీలు ,గ్రామపంచాయతీ సెక్రటరీలు , ఆశా వర్కర్లు, విద్యుత్ శాఖ అధికారులు,పాల్గొన్నారు.

## జీవో 177 ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలి

### గిరిజన ఏజెన్సీ చట్టాలకు వ్యతిరేకం

### మున్సిపల్ కార్పొరేషన్ వద్దు సేవాలాల్ సేన జిల్లా కమిటీ డిమాండ్



టేకులపల్లి, అక్టోబర్26, ప్రజాజ్యోతి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో జీవో 177ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని సేవాలాల్ సేనజిల్లా కమిటీ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్ మాట్లాడుతూ కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీతో గిరిజన మండలాలను కలుపుతూ ఏజెన్సీ చట్టాలను తూట్లు పొడుస్తూ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు దిశగా అడుగులు వేయడం వల్ల ఏజెన్సీ గిరిజన ప్రజలకు తీరని అన్యాయం జరుగుతుంది అని వారు ఆరోపించారు. ఏజెన్సీ హక్కులను గిరిజన ప్రజలు కోల్పోతారని వారికి రావాల్సిన ఉద్యోగాలు గిరిజన హక్కులు అన్ని కూడా హరిస్తాయని అన్నారు.అభివృద్ధికి ఎవరు అడ్డంకి కాదని ఏజెన్సీ ప్రాంతాలుగా ఉన్నా కూడా లక్ష్మీదేవిపల్లి ,చుంచుపల్లి ,సుజాతనగర్,మండలాలలో ఉన్న గ్రామాలు అభివృద్ధి వైపు అడుగులు వేస్తూ ఉన్నాయని మాటల్లో వ్యక్తం చేశారు. చుంచుపల్లి మండలం విద్యానగర్ గ్రామపంచాయతీ ఉదాహరణగా తీసుకుంటే మున్సిపల్ కార్పొరేషన్ కంటే ఎక్కువ అభివృద్ధి చెందుతూ వస్తుందని ఈ మండలంలో సీఎంఆర్ షాపింగ్ మాల్స్, జీవి మాల్స్, సౌత్ ఇండియా షాపింగ్ మాల్స్ ,మరెన్నో కార్పొరేట్ సంస్థలు ఏజెన్సీ ప్రాంతంలోనే ఉన్నాయి,కాబట్టి అభివృద్ధికి ఏజెన్సీ గ్రామాలు ఏ మాత్రం అడ్డంకి కాదని వారు ఆరోపించారు. ఇది కేవలం కుట్రపూరితంగా ఈ గ్రామాలను మున్సిపల్ కార్పొరేషన్ చేసి అక్కడున్న గిరిజన ప్రజల భూములను లాక్కునిందుకే కొందరు ప్రయత్నిస్తున్నారని అన్నారు.ఏజెన్సీ ప్రాంతాల జోలికి వస్తే తాడో పేడో తేల్చుకోవడనికి సేవాలాల్ సేన వెనుకడుగు వేయదని వారు ఆరోపించారు.భారత రాజ్యాంగం ఏజెన్సీ చట్టాలను గిరిజన ప్రజల అభివృద్ధి కోసం ప్రత్యేక చట్టాలు ఈ జిల్లాలో అమలౌతున్నాయని అని అన్నారు.వాటిని కొంతమంది బడాబాబుల అభివృద్ధి కోసం చేస్తున్న ప్రచారమే అంతే కాకుండా 5వ షెడ్యూల్ భూభాగంలో ఉన్న ప్రాంతాలు 1/70 చట్టం,పీసా చట్టం అమలులో ఉన్న ప్రాంతంలో ఈ చట్టాలకు విరుద్ధంగా ఏజెన్సీ భాగాన్ని అభివృద్ధి పేరిట విధ్వంసానికి పాల్పడటం మానుకోవాలని సేవాలాల్ సేన జిల్లా కమిటీ హెచ్చరించిది.మున్సిపల్ కార్పొరేషన్ వలన ఏజన్సీ గిరిజన ప్రజలకు ఎలాంటి లాభమో తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.ఏజెన్సీ 5వ షెడ్యూల్ ప్రాంతాన్ని మున్సిపల్ కార్పొరేషన్ చేయడం వలన స్వయం 100 రోజుల ఉపాధి ఐటీడీఏ ద్వారా వచ్చే అభివృద్ధి పథకాలు సర్పంచ్ ,ఉప సర్పంచ్ వార్డు మెంబర్స్, ఎంపీటీసీలు జడ్పిటిసిలు ఎంపీపీ వంటి పదవులతో పాటు వివిధ రకాల ఉద్యోగాలు గిరిజన ప్రజలు కోల్పోయే ప్రమాదం ఉన్నదని,పీసా చట్టం ప్రకారం పీసా గ్రామసభల ద్వారా చేసే అభివృద్ధి కార్యక్రమాలకు కూడా కోల్పోతారని అన్నారు.కొత్తగూడెం,పాల్వంచ మున్సిపాలిటీలతో పాటు చుంచుపల్లి, లక్ష్మీదేవి పల్లి,సుజాతనగర్, పాల్వంచ మండలాల లోపల కొన్ని ఏజెన్సీ గ్రామాలను కలుపుకొని మున్సిపల్ కార్పొరేషన్ చేసే ప్రయత్నాలను విరమించుకోవాలని సేవాలాల్ సేన వారు హెచ్చరించారు. లేనియెడల దశలవారిగా ఉద్యమాలు,ఆందోళనల కార్యక్రమాలకు సేవాలాల్ సేన తీసుకుంటుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి లావుడియావెంకటేష్ నాయక్, జిల్లా అధికార ప్రతినిధి బానోత్ నాగరాజు నాయక్, రాందాస్ నాయక్,రాజేందర్ నాయక్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పంట పొలాలకు గిట్టుబాటు ధర కల్పించాలి

### సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా పార్టీ డివిజన్ నాయకురాలు సిమిడి సుజాత



చర్ల, అక్టోబర్ 26, ప్రజా జ్యోతి:

చర్ల మండలం ఆర్ కొత్తగూడెం గ్రామంలో అఖిల భారత రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు రైతు సంఘం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డివిజన్ నాయకురాలు సిమిడి సుజాత మాట్లాడుతూ రైతు పండించిన అన్ని రకాల పంటలకు మద్దతు ధర ప్రభుత్వం కల్పించాలని, అన్ని పంటలను కొనుగోలు చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెండు లక్షల రుణమాఫీ చేసి రైతులకు కొత్త రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పత్తి, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని, రైతులకు రైతు బీమా సౌకర్యం, రైతుబంధు డబ్బులు వెంటనే మంజూరు చేయాలని, కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, రైతులకు వ్యవసాయ పరికరాలను పూర్తి సబ్సిడీతో ఇవ్వాలని, తెగిపోయిన చెరువులకు మరమ్మత్తులు చేపట్టాలని, పూడిక తీయాలని ,తాలిపేరు ప్రాజెక్టు ద్వారా రైతులందరికీ సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజు, వనిత, వీణ, లక్ష్మీ,నరసమ్మ పాల్గొన్నారు.

# బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమం

పాల్వంచ రూరల్, అక్టోబర్ 26, ప్రజాజ్యోతి

పాల్వంచ మండలం పాండురంగాపురం గ్రామపంచాయతీ లో, శనివారం బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమంజరిగింది, ఈ కార్యక్రమం గత ఐదు రోజులనుంచి నడుస్తుంది,ఈరోజు చివరి రోజు కావున ముఖ్యఅతిథిగా కార్యక్రమం కీ, ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి, ఏపీఎం రాంబాబు, ఏ పీ ఓ రంగయ్య,సిసి శీను, ఉషాకిరణ్( వి ఓ ) అనురాధ, భూక్య హుస్సేన్, భూక్య రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# రక్తదానం ప్రాణదానంతో సమానం






**– పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్**

*పాల్వంచ, అక్టోబర్ 26, ప్రజాజ్యోతి:*

రక్తదానంతో ఆపదలో ఉన్న వారికి ప్రాణదాతలు అవుతామని పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాలతో పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పాల్వంచ పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ.. ప్రజల భద్రత కోసం పోలీసులు ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలకు గుర్తుగా అమరవీరుల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రక్తదానం ద్వారా రక్తాన్ని అందించేవారు రియల్ హీరోగా వర్ణించారు. ఆపద సమయంలో ప్రాణదానంగా ఈ రక్తదానం ఉపయోగపడుతుందని ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని సూచించారు. పాల్వంచ సీఐ వినయ్ కుమార్ తోపాటు ఎస్సై సుమన్ రక్తదాన శిభిరాన్ని పర్యవేక్షించారు. ఈ రక్తదాన శిబిరంలో డివిజన్ లోని పోలీస్ అధికారులు, ఇతర పోలీస్ సిబ్బంది, పట్టణంలోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు, పట్టణ, మండల యువకులు భారీగా పాల్గొని రక్తాదానం చేశారు.

# సిఎం రిలీఫ్ ఫండ్ పథకం పేదలకు ఆసరా





**సిఎంఆర్ఎఫ్ పథకాన్ని పెదలు సద్వినియోగం చేసుకోవాలి.**

**కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు**

**166 మంది లబ్దిదారులకు రూ. 61.65లక్షల విలువచేసే చెక్కులు అందించిన ఎమ్మెల్యే.**

*కొత్తగూడెం మున్సిపాలిటీ, అక్టోబర్ 26, ప్రజా జ్యోతి*

సిఎం రిలీఫ్ ఫండ్ పథకం పేద కుటుంబాలకు వరమని, ప్రతి పేద కుటుంబం ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని 166 మంది సిఎంఆర్ఎఫ్ పథకం క్రింద రెండో దఫా మంజూరైన చెక్కులను శనివారం సిపిఐ జిల్లా కార్యాలయం 'శేషగిరిభవన్'లో లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ గత ప్రభుత్వం విధించిన రూ.60వేల కటాఫ్ నిబంధనను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కొనసాగించడం వల్ల పేద కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నారని, ఈనిబంధనను సడలించాలని కోరారు. అత్యవసర పరిస్థితిలో వైద్యం కోసం పేదలు వెచ్చించి ప్రతి పైసా ప్రభుత్వం తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రులను కార్పొరేట్ స్థాయిలో బలోపేతం చేస్తే పేదలు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించి నష్టపోయోపరిస్థితి ఉండదన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకం పేదలకు అందేలా చొరవ తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, జిల్లా సమితి సభ్యులు వాసిరెడ్డి మురళి, ఎస్ కె ఫేహీమ్, పొలమురి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు భట్టు మురళీ కౌన్సిలర్లు, నాయకులు నునవాత్ గోవిందు, గోపాల్ రావు, బోయిన విజయకుమార్, దుర్గ, సత్యనారాయణ చారి, మురళి, లక్ష్మీనారాయణ, సపవట్ రవి ఖయుమ్ ాపాల్గొన్నారు.

## జీతాలు చెల్లించాలని ఎమ్మెల్యేకి వినతి పత్రం సిఐటియు



*చర్ల, అక్టోబర్ 26, ప్రజా జ్యోతి:*

మినీ టీచర్ నుండి మెయిన్ టీచర్ గా ప్రమోషన్ పొందిన అంగన్వాడీ టీచర్లకు పూర్తి జీతం చెల్లించాలని డిమాండ్ చేస్తూ, తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు భద్రాచలం స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకటరావుకు చర్లలో వినతిపత్రం అందజేశారు. ధర్నా చేపట్టి ప్రాజెక్ట్ సిఐటియు కార్యదర్శి, సిఐటియు మండల కన్వీనర్ పాయం రాధాకుమారి మాట్లాడుతూ మినీ టీచర్ నుంచి మెయిన్ టీచర్ గా ప్రమోషన్ ఇచ్చిన నాటినుండి సగం జీతం మాత్రం చెల్లిస్తున్నారని, వర్కర్స్ ను తీవ్ర మనో వేదనకు ప్రభుత్వం గురుచేస్తున్నదని తెలిపారు. పోరాడి సాధించుకున్న హక్కులను సైతం ప్రభుత్వం అంగన్ టీచర్లకు , హెల్పర్లకు అమలు చేయడం లేదని అన్నారు. గత ఐదు నెలలుగా పెండింగ్లో ఉంచిన సగం జీతాలను కూడా వెంటనే చెల్లించాలని సిఐటియు డిమాండ్ చేసింది. సమస్యను పరిష్కరించాలని ఎన్నోసార్లు మంత్రులను కలిసిన కూడా ప్రభుత్వం తీరు దున్నపోతు మీద వాన కురిసినట్టు ఉందని విమర్శించారు. ఇప్పటికైనా స్పందించకపోతే సమ్మె చేస్తామని హెచ్చరించారు. తి పత్రం పై స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి, మంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారాన్ని కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ టీచర్స్ అన్ని హెల్పర్స్ యూనియన్ సిఐటి ప్రాజెక్ట్ నాయకురాలు పాయం రాణి, జ్యోత్స్న, రాణి, స్వరూప ,సరిత, నాగమణి, వెంకటరమణ, తులసి తదితరులు పాల్గొన్నారు.

## గ్యార్మీ వేడుకలకు హాజరైన ఎంపి



*ఇల్లందు, అక్టోబర్ 26, ప్రజాజ్యోతి:*

మండలంలోని లలితాపురం మామిడి తోటలో ప్రముఖ కూరగాయల వ్యాపారి యాకుబ్ సేటు కుమారులైన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్.కె.జానీ, వ్యాపారులు గౌస్, ఖాజాలు గ్యార్మీ వేడుకలను శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ గ్యార్మీ వేడుకలకు మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యుడు పోరిక బలరాం నాయక్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత చేపపిల్లల పంపిణీ

*ములకలపల్లి, అక్టోబర్ 26, ప్రజాజ్యోతి:*




తెలంగాణ ప్రభుత్వ మ త్స్యఅ భివ ృద్ధి పథకం ద్వారా మండలంలోని 20 గ్రామ పంచాయితీ లలో ఉన్న ప్రభుత్వ మరియు సొసైటీ చెరువులకు శనివారం మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణంలో ఎంపిడీఓ లక్ష్మయ్య, జిల్లా మత్స్యశాఖ అధికారి ఇంతియాజ్ అహ్మద్ ఖాన్ చేతుల మీదుగా ఉచిత చేపపిల్లలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా మత్స్యశాఖ అధికారి ఇంతియాజ్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ మండలంలోని నలభై మూడు చెరువులకు కట్ల, రోహు బంగారుతీగ రకాలకు చెందిన మొత్తం రెండు లక్షల ముప్పె రెండు వేల ఐదు వందల చేపపిల్లలను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ములకలపల్లి మండల మత్స్యశాఖ క్షేత్రస్థాయి అధికారి మీడియం మంగరాజు, సిబ్బంది సూర్యప్రకాష్, రాంబాబు పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## క్వింటా పత్తికి మద్దతు ధర రూ.15 వేలు ఇవ్వాలి

**మండలంలో చిల్లర కౌంటర్లు ఎత్తివేయాలి**

**సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ నాయకులు డిమాండ్..!**



*టేకులపల్లి, అక్టోబర్26, ప్రజా జ్యోతి:*

క్వింటా పత్తికి మద్దతు ధర రూ.15వేలు ఇవ్వాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ టేకులపల్లి మండల కార్యదర్శి ధర్మపురి వీరబ్రహ్మాచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం మండల కార్యదర్శి మాట్లాడుతూ ఈసీజన్లో రైతులు పంట వేసి అతివృష్టి కి అనావృష్టి కి గురై పంటలు అనుకునేంతగా దిగుబడి రాక రైతులు అప్పులు పాలవుతున్నారని వారు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు గిట్టుబాటు ధర లేక అతి తక్కువ రేటుకు పంటలు అమ్ముకొని తీవ్రంగా నష్టపోతున్నారు అని తెలిపారు. రైతులకు మేలు చేస్తామని మాయమాటలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచి కాలయాపన చేస్తూ రైతుల సమస్యలను మర్చిపోయారని ఆరోపించారు. ఇప్పటికే రైతు భరోసా ఎగ్గొట్టారని రైతులకు రుణమాఫీ సగం మందికి కూడా కాలేదని వారు తెలిపారు. తక్షణమే రైతు రుణమాఫీ చేయాలని రైతు భరోసా రైతు ఖాతాలో వేయాలని డిమాండ్ చేశారు. రైతులు పండించే అన్ని పంటలకు 500 రూపాయలు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు బీమా, పంటలకు భీమా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే మండల కేంద్రంలో, గ్రామాలలో పత్తి చిల్లర కౌంటర్ల ద్వారా ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నారని అట్టి వారిపై వెంటనే చర్యలు తీసుకొని చిల్లర కౌంటర్లను ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎంఎల్ మాస్ లైన్ డివిజన్ నాయకులు జరుపుల సుందర్, మండలనాయకులు బి.పంతులు, బి. లింగ, ఏ.నాగయ్య తదితరులు పాల్గొన్నారు .